మీ గళం.. మా కలం...

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :114 ఎడిటర్: గొడిశాల సోమయ్య శుక్రవారం 20-09-2024 పేజీలు :4 వెల : 2రూ



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066


## కొత్త రేషన్ కార్డులపై సీఎం కీలక ప్రకటన



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్: త్వరలోనే కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుది. రేషన్ కార్డులు పొందేందేకు అర్హతలున్న ప్రజలు సంవత్సరాల తరబడి నిరీక్షిస్తూనే ఉన్నారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోగా, బీఆర్ఎస్ హయాంలో రెండున్నర సంవత్స రాల క్రితం మళ్లీ ఆ ప్రస్తావన వచ్చింది. 2021 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనతో కొత్త కార్డుల ప్రక్రియ తెరపైకి రాగా, అర్హతగల వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. రెండున్నరేళ్లు గడిచినా తిరిగి కొత్త కార్డుల ఊసే ఎత్తకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈరోజు(గురువారం) తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల జారీకి విధివిధానాలు త్వరగా రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సీఎం రేవంత్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు కసరత్తు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో తెలంగాణలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, అర్హతగల వారికి త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీకి మోక్షం కలగనుంది. ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందజేసే క్రమంలో విధివిధానాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే.ఈ మేరకు కొత్త రేషన్ కార్డుల జారీ కోసం క్యాబినెట్ స్థాయిలో సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మం త్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం అవసరమైన విధి విధానాలను రూపొందించి సబ్ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. సబ్ కమిటీ సిఫార్సు మేరకు రేషన్ కార్డుల జారీ విషయమై రేవంత్ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ఆరోగ్య శ్రీ ప్రయోజనం కోసం కొందరు తెల్లకార్డులు తీసుకుంటుండటంతో....ప్రజా పంపిణీ వ్యవస్థకు, ఆరోగ్య శ్రీ పథకానికి వేర్వేరుగా తెల్లరేషన్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టనున్నట్లు ఇటీవల సమావేశమైన సబ్ కమిటీ పేర్కొంది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పట్టణాల్లో రూ. 2 లక్షల్లోపు, గ్రామాల్లో రూ. లక్షన్నర వార్షికాదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు లేదా చెల్క 7.5 ఎకరాల్లోపు ఉన్నవారికే తెల్ల కార్డులు ఇవ్వాలని ప్రతిపాదించింది. మరోవైపు దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారు ఎవరూ తెల్లకార్డు అవకాశం కోల్పోకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో దరఖాస్తు చేసుకున్న వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

## అక్కసుతోనే ఆరోపణలు..
## విపక్షాలపై మంత్రి ఆగ్రహం..



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్, సెప్టెంబర్ 18: విపక్ష పార్టీపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష పార్టీలు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలే కాదు.. ఇవ్వని హామీలను కూడా రేవంత్ సర్కార్ నెరవేరుస్తోందన్నారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందన్నారు.మిషన్ భగీరథపై సర్వే చేస్తే 53 శాతం ఇళ్లకు మంచి నీళ్లు రావడం లేదని తేలిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రూ. 73 వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించామన్నారు. రూ. 18 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ పక్కాగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్‌లో రూ. లక్ష కోట్లు, మిషన్ భగీరథ పేరుతో రూ. 15 నుంచి 20 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మంత్రి పొంగులేటి ఆరోపించారు.

2లో


## మౌన వ్రతంలో మాజీ ముఖ్యమంత్రి



నమస్తే హైదరాబాద్ : ఆయన మాట్లాడినా సంచలనమే, మాట్లాడకున్నా సంచలనమే. అసలు, ఆయన మౌనమే ఓ భారీ కార్యాచరణను తలపిస్తుంది. మరి తెలంగాణలో రాజకీయం రణరంగాన్ని తలపిస్తుంటే.. ఆయన ఎందుకు మాట్లాడట్లేదు..? రాష్ట్ర సాధకుడిగా పేరొందిన వ్యక్తి.. ఇప్పుడెందుకిలా మౌనమునిగా మారిపోయారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురించి.. పార్టీ వర్గాల్లోనే కాదు, యావత్ తెలంగాణ ప్రజానీకంలో జరుగుతున్న చర్చ ఇది. ఇంతకీ ఆయన సైలెన్స్ దేనికి సంకేతం?

2లో

## హైడ్రా నెక్ట్స్ టార్గెట్ హుస్సేన్‌సాగర్‌లో నిర్మాణాలేనా..



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్, సెప్టెంబర్ 19: చెరువులపై అక్రమ నిర్మాణాల కూల్చివేతే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. రాష్ట్రంలో చెరువులు, నాళాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే పనిలో వేగం పెంచింది హైడ్రా. ఇప్పటికే అనేక అక్రమ నిర్మాణాలు నేలకూలాయి. ప్రస్తుతం కొద్ది రోజులు నిర్మాణాల కూల్చివేతకు గ్యాప్ తీసుకున్న హైడ్రా మళ్లీ విజృంభించేందుకు సిద్ధమైంది. హైడ్రా నెక్ట్స్ ఫోకస్ హుస్సేన్ సాగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలే. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన థ్రిల్ సిటీ, జలవిహార్ పై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జలవిహార్‌ను కూల్చి వేయాలంటూ హైడ్రాకు సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేశారు. హుస్సేన్‌సాగర్‌ను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలంటు డిమాండ్‌లు భారీగా వినిపిస్తున్నాయి. జలవిహార్ ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను హైడ్రా కమిషనర్‌కు సీపీఐ నేతలు అందజేశారు. హుస్సేన్ సాగర్ ఎఫ్టఎల్, బఫర్ జోన్ పరిధిలో 12.5 ఎకరాల్లో జలవిహార్ ఏర్పాటు అయ్యింది. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరికిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది.2007 లో జలవిహార్ ప్రారంభమైంది. జలవిహార్‌కు అప్పటి ప్రభుత్వం 30 ఏళ్ళ లీజ్‌కు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. జలవిహార్‌లో వాటర్ పార్క్, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సందర్శకుల ద్వారా వచ్చే డబ్బులు, ఫంక్షన్ హాల్స్ ద్వారా కోట్ల రూపాయలను జలవిహార్ అర్జిస్తోంది. జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే వెళతాయి. ఈ క్రమంలో జలవిహార్‌కు సంబంధించి ఫిర్యాదుల వెల్లువెత్తిన నేపథ్యంగా హైడ్రా నెక్ట్స్ టార్గెట్‌గా జలవిహారం నిలిచింది.

## హుజూర్‌నగర్ దవాఖానలో దారుణం.




నమస్తే హైదరాబాద్ : హుజూర్‌నగర్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలోని సర్కార్ దవాఖానాల్లో నిలువెత్తు నిర్లక్ష్యానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ.

2లో

## దేవాభివృద్ధి కోసమే జమిలి ఎన్నికలు



2లో

## స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల నిధులు

నమస్తే హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, మంత్రి శ్రీధర్ బాబు, కో-చైర్మన్ శ్రీనిరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన కీలక అంశాలను పారిశ్రామికవేత్తలకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్కిల్స్ యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు కార్పొరేట్లు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా యూనివర్సిటీకి సహాయం అందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయిలో



నైపుణ్యాలు కలిగిన యువతను అందించాలన్న తన ఆలోచనను వివరించారు.

2లో

# అక్కసుతోనే ఆరోపణలు.. విపక్షాలపై మంత్రి ఆగ్రహం..

బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ఏమీ చేయలేదని విమర్శించారు. పని చేస్తున్న కాంగ్రెస్‌పై గత పాలకులు బట్టకాల్చి మీద వేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో గానీ.. వచ్చే నెల మొదటి వారంలో కానీ అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. దార్శనికత ఉండాలి కానీ.. అవకాశవాదం ఉండకూడదన్నారు. ఓరుగల్లు అభివృద్ధిని గత పాలకులు పట్టించు కోలేదని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో రూ. 650 కోట్లు విద్య కోసం ఖర్చుచేసి తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. 119 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ని కట్టించబోతున్నామని మంత్రి చెప్పారు. 25 ఎకరాలలో ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని నిర్మిస్తున్నామన్నారు. రూ. 110 కోట్లతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న వారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి జీర్ణించుకోలేకపోతున్నారని.. అందుకే ప్రతి దాన్ని రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వారి ప్రభుత్వ హయాంలో వారు చేసి చేసిన తప్పులు.. ఇప్పుడూ జరుగుతున్నాయనే భ్రమలో బ్రతుకుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎద్దేవా చేశారు.

# దేశాభివృద్ధి కోసమే జమిలి ఎన్నికలు

కేంద్ర మంత్రివర్గం ఏకకాల ఎన్నికలకు ఆమోదం తెలపడం అభినందనీయమైన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. దీని వల్ల ఖర్చును ఆదా చేయడంతోపాటు దేశాభివృద్ధి మెరుగుపరుస్తుందన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం బుధవారం(సెప్టెంబర్1 8) ఆమోదం తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ మార్చిలో లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందు నివేదికను సమర్పించింది. దీనిపై మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బుతోపాటు వనరులను ఆదా చేయడం, అభివృద్ధి, సామాజిక ఐక్యతను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు భారతదేశ ఆకాంక్షలను సాకారం చేయడంలో ప్రజాస్వామ్య పునాదిని బలోపేతం చేయడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఏకకాల ఎన్నికలు మోడల్ ప్రవర్తనా నియమావళి (%వీజజ%) విధించడం వల్ల విధాన పక్షవాతం కారణంగా అభివృద్ధి పనులకు అంతరాయం కలిగించడమే కాకుండా, ఎన్నికల సమయంలో మోహరించిన కీలకమైన సిబ్బందిపై ఓటరు అలసత్వం, భారానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. ఏకకాల ఎన్నికలతో పోల్చితే దాదాపు 1.5 శాతం ఎక్కువ వాస్తవ జాతీయ వృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఏకకాల ఎన్నికల సమయంలో ద్రవ్యోల్బణం తగ్గుదల ఎక్కువగా ఉంటుంది. ద్రవ్యోల్బణంలో 1.1 శాతం పెద్ద పతనం ఉంటుందని కిషన్ రెడ్డి అంచనా వేశారు. విడివిడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖజానాపై గణనీయమైన ఆర్థిక భారం పడిందన్న కేంద్ర మంత్రి, గత పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఖర్చులు రూ. 4,500 కోట్లకు మించాయన్నారు. కేబినెట్ ముందు రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ నివేదికను సమర్పించడం న్యాయ మంత్రిత్వ శాఖ 100 రోజుల ఎజెండాలో భాగం. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు చేసింది. ఆ తర్వాత 100 రోజుల్లోగా ఏకకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిఫార్సు చేసింది. సిఫార్సుల అమలును పర్యవేక్షించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించింది.

# స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల నిధులు

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా స్వాగతించారు. తెలంగాణ యువతకు నైపుణ్యాలు అందించాలన్న ఈ మహత్తర ఆలోచనను నేరవేర్చడంలో భాగస్వామ్యం అవ్వడం గర్వంగా ఉంది అన్నారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డి గొప్ప విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన విజన్‌ను నమ్మి, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ పదవిని సంతోషంగా స్వీకరించాను అని తెలిపారు. ఈ సమావేశంలో ఈ ఏడాదిలో ప్రారంభించనున్న పలు కోర్సుల వివరాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు యూనివర్సిటీ అభివృద్ధి పట్ల పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# మౌన వ్రతంలో మాజీ ముఖ్యమంత్రి

అందరికీ రాజకీయాలంటే గేమ్ కావొచ్చు..! కేసీఆర్ మాత్రం రాజకీయమంటే ఒక టాస్క్. ఈ మాటలు గతంలో స్వయంగా కేసీఆర్ చెప్పినవే. కేవలం మాటలు కాదు%ొ% రాజకీయాల విషయంలో ఆయన చేతలు కూడా అలానే ఉంటాయి. ఉద్యమ సమయం నుంచి మొన్నటి దాకా%ొ% ఆయన రాజకీయ చాణక్యం అలానే ఉండేది. ప్రత్యర్థులకు అంతుచిక్కని పదునైన వ్యూహాలతో%ొ% రాజకీయ దురంధరుడిగా పేరు గడించారు. 14ఏళ్ల ఉద్యమం నడిపి, తెలంగాణను సాధించి.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్.. మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమి చెందారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత.. తుంటి ఎముకకు గాయం కావడం ఆయన్ని మరింత నీరసించేలా చేసింది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా%ొ% ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌కు తొలిరోజు హాజరైనా%ొ% ఆయన మునుపటిలా యాక్టివ్‌గా లేరు. తన వ్యవసాయ క్షేత్రంలోనే సేద తీరుతున్న కేసీఆర్, అడపాదడపా పార్టీ నేతలను కలుస్తున్నారు. కానీ, రాజకీయంగా ఆయన బయటకు వచ్చి చాలా రోజులైంది. ఇప్పుడిదే అంశం.. గులాబీ శ్రేణులను, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు నిరుత్సాహపరుస్తోంది.

# ప్రాణం తీసిన విద్యుత్ కంచె..



నమస్తే హైదరాబాద్ : పొలానికి నీళు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు, మరో రైతు కోతుల నుంచి తన పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు( తగిలి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జెల్ల పెద్ద ముత్తన్న (60) రోజులాగే తనకు గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు మందును చల్లాడానికి వెళ్లారు. పక్కనే రత్నాపూర్ గ్రామానికి చెందిన గొండ సాయన్న అనే రైతు తన మక్క చేనును కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి, వ్యవసాయ మోటరు నుంచి అక్రమంగా కరెంట్‌ను పెట్టాడు.

# హుజూర్‌నగర్ దవాఖానలో దారుణం.

నిత్యం ఎన్నో దారుణాలు వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో అభాగ్యుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. ఓ మహిళకు పురిటినొప్పులు రావడంతో కాన్పు కోసమని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. సర్కారు దవాఖానాలో తనకు పురుడు పోసి బిడ్డను తన చేతుల్లో పెడతారని ఎంతో నమ్మకం పెట్టుకొని వచ్చిన ఆ నిండు గర్భిణీ నరకం చూసింది. సాధారణ ప్రసవం కావాలని సిబ్బంది చేసిన నిర్వాకంతో సదరు మహిళ మానసికంగా, శారీరకంగా ఎంతో వేదన అనుభవించింది. డ్యూటీలో ఉన్న డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సులు బూతులు తిడుతూ, ఇష్టంవచ్చినట్టు కొట్టినా పుట్టబోయే తన పాపాయి కోసం అన్నీ భరించింది. కానీ చివరికి ఆ తల్లి చేతుల్లోనే బిడ్డ ఊపిరి వదలడం చూసి తట్టుకోలేక గుండెలవిసేలా రోధించింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఏరియా దవాఖానలో నర్సులు చేసిన అమానవీయ వైద్యం ఓ పసికందు నిండు ప్రాణం తీసింది. వివరాల్లోకెళ్తే..సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఏరియా దవాఖానలో మంగళవారం ఈ దారుణం జరిగింది. మఠంపల్లి మండలం గుర్రంబోడు తండాకు చెందిన పాసిపాక నాగరాజు భార్య రేణుకకు ఆదివారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో హుజూర్‌నగర్ ఏరియా దవాఖానకు కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ఆ సమయంలో డ్యూటీలో ఉండవల్సిన వైద్యులు అందుబాటులో లేకపోయినా నర్సులు అడ్మిట్ చేసుకున్నారు. రాత్రి వరకూ వైద్యం అందించకపోవడంతో భర్త నాగరాజు సిబ్బందిని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన నర్సులు రేణుకను బూతులు తిడుతూ నొప్పులు రావాలని.. నిండు గర్భిణిని కాలుతో ఇష్టం వచ్చినట్లు తొక్కారు. సోమవారం తెల్లవారుజామున రేణుకకు సాధారణ ప్రసవం అయ్యింది. బిడ్డ బయటకు వచ్చిన కాసేపటికే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే నాగరాజు శిశువును తీసుకుని అక్కడికి వెళ్లేలోగా పసికందు మృతి చెందాడు. దీంతో నాగరాజు సూర్యాపేట డీఎంహెచ్‌వో కోటాచలానికి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎంహెచ్‌వో హుజూర్‌నగర్ ఏరియా వైద్యశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. శిశువు పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్యూటీ డాక్టర్ లేరని నర్సులు అమానవీయంగా ప్రవర్తించారని డీఎంహెచ్‌వోకు చెప్పి రేణుక కన్నీటిపర్యంతమైంది. నిండు గర్భంతో ఉన్న తనను నర్సులు కడుపుపై కాలితో తొక్కారని, తన బిడ్డను చంపారని విలపించింది. డ్యూటీ డాక్టర్‌తో పాటు నర్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రోదిస్తూ చెప్పింది.

# ఈనెల 21వరకు అభ్యంతరాల స్వీకరణ-ఎంపీడీవో ధారా శ్రీనివాస్

నాగారం,నమస్తే హైదరాబాద్:( సెప్టెంబర్ 19) రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 13న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ జాబితాలపై ఈనెల 21 వరకు అభ్యంతరాలు ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామపంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని ఎంపీడీవో దారా శ్రీనివాసు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశ%శీ% నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ముసాయిదా జాబితాలను స్థానిక గ్రామపంచాయతీ మండల అభివృద్ధి కార్యాలయంలో జాబితా ప్రదర్శించడం జరిగిందని, అట్టి జాబితా పై అభ్యంతరాలు ఆక్షేపణలు ఉంటే ఈనెల 21లోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని తెలిపారు. పార్టీ అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26 లోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. తుది



ఫోటో ఎలక్ట్రాన్ జాబితాను ఈనెల 28న ఆయా గ్రామపంచాయతీ మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. పార్టీల ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కే మారయ్య, సూపర్డెంట్ ముత్తయ్య, నాయకులు కూరం వెంకన్న, ఆకుల బుచ్చిబాబు, తొడుసు లింగయ్య, సంపెట కాశయ్య,చిప్పలపల్లి నాగార్జున, పేరాల శ్రీనివాస్, కడియం కుమార్, పులుసు శేఖర్ గౌడ్,పులుసు హుస్సేన్,బి లింగయ్య,ఏ రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# దశలవారీగా మియాపూర్ డివిజన్ అభివృద్ధి : కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



నమస్తే హైదరాబాద్( శేరిలింగంపల్లి న్యూస్) మియాపూర్ డివిజన్ హెచ్ఎంటి,శ్రీలక్ష్మి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ను ఆ కాలనీ అసోసియేషన్ సభ్యులు కోరారు.ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌకాలనీలలో అసంపూర్తి మిగిలిపోయిన రోడ్లనిర్మాణం పనులను పూర్తిచేయాలని, మంచినీటి వసతిని మెరుగుపర్చాలని,భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులు చేపట్టాలని కార్పొరేటర్ ను కోరారు.ఈ క్రమంలో సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ డివిజన్ లో నెలకొన్న సమస్యలను హౌఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి, హౌఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి కాలనీ, శ్రీ లక్ష్మి నగర్ కాలనీల వాసులు దేవేందర్ రావు, విరుపాక్షయ, అద్దంకి బాలు చౌదరి,బి ఆర్ చౌదరి పాల్గొన్నారు.

# 12వ వార్డులో సీసీ రోడ్డు ప్రారంభించిన పావని జంగయ్య

ఘట్కేసర్ సెప్టెంబర్ 19 (నమస్తే హైదరాబాద్)మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో సీసీ రోడ్డు ప్రారంభించిన ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. పావని జంగయ్య మాట్లాడుతూ 12వ వార్డులో 10 లక్షల వ్యయంతో సిసి రోడ్డు వేయడం జరిగిందని, ఆక్కడి కాలనీవాసులు సిసి రోడ్డు లేదని చెప్పడంతో స్థానిక వార్డు కౌన్సిలర్, చైర్పర్సన్ ను తీసుకురావడంతో వెంటనే తీర్మానం చేసి కొత్త సీసీ రోడ్డు వేయించడం జరిగిందని తెలియజేశారు. దీంతో 12వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ పద్మారావు, 4వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు గౌడ్,11 వ వార్డ్ కౌన్సిలర్ కడుపొల్లా మల్లేష్,13 వ వార్డు కౌన్సిలర్ జహంగీర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిత్తారి



యాదవ్,శివ, కదుపోల్ల సైలు, కందకట్ల బలవంత రెడ్డి, కందకట్ల గోవర్ధన్ రెడ్డి మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కానీ రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి -ఏవో కృష్ణ కాంత్

నాగారం, నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 19) ఇప్పటివరకు రేషన్ కార్డు లేకపోవడం/కుటుంబ నిర్ధారణ కాకపోవడం అనే కారణం చేత రైతు రుణమాఫీ కాని రైతులు ఆధునికరించిన యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణ కాంత్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డు లేకపోవడం, కుటుంబ నిర్ధారణ కాకపోవడం వలన రుణమాఫీ కానీ రైతులు 488 మంది ఉన్నారు. అందులో 343 మంది రైతుల వివరాలు స్వీయ చిత్రం, ధ్రువీకరణ పత్రంతో పాటు అంతర్జాలంలో నమోదు చేయడం జరిగింది. మిగిలిన 145 మంది కూడా తమ పూర్తి వివరాలను ఆధునీకరించిన యాప్లో నమోదు చేసుకోవాలి అని కోరడం జరిగింది. ఇప్పటి వరకు ఎవరైనా పెళ్లి కాకుండా తల్లిదండ్రులతో నివసిస్తున్న యువతులు, యువకులు అలాగే ఆధార్ కార్డు లేని, రైతు రుణం పొంది చనిపోయిన రైతులకు సంబందించిన కుటుంబీకులు, తెలంగాణలో లేని వారు ఉన్నారు. కనుక సదరు రైతులు తమ పూర్తి వివరాలను మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించి ఆధునీకరించిన యాప్లో నమోదు చేసుకోవాలని మండల ప్రజలకు తెలియజేశారు.

# నర్సింగ్ విద్యార్థిని శృతి ది ఆత్మహత్యే : గచ్చిబౌలి పోలీసులు



నమస్తే హైదరాబాద్( శేరిలింగంపల్లి న్యూస్) గచ్చిబౌలిలోని ఓ హెూటల్‌లో నర్సింగ్ విద్యార్థిని శృతి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. శృతి ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు కేసును చేధించారు. శృతిది ఆత్మహత్యేనని, దీనికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు నిర్ధారించారు. హెూటల్ గదిలో బీరు తాగిన సమయంలోని ఇరువురి మధ్య పెళ్లి విషయం చర్చకు వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో జీవన్ పెళ్లికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చెలరేగిందని. ఆ తర్వాత జీవన్ పక్కనే ఉన్న తన ఫ్రెండ్ గదికి వెళ్లిపోయాడని పోలీసులు తేల్చారు. అదే సమయంలో శృతి క్షణికావేశంలో గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు.ఇక కేసు విషయానికొస్తే జడ్చర్లకు చెందిన శృతి (23) గత ఆదివారం హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకలకు చూసేందుకు గాను మోనా, జీవన్ మరో అబ్బాయితో కలిసి వచ్చారు. ఇదే విషయాన్ని తెలిపి రెడ్‌స్టోన్ హెూటల్‌లో రెండు గదులను తీసుకున్నారు. ఆ తర్వాత శృతితో వచ్చిన వారంతా హెూటల్ నుంచి బయటకు వెళ్లారు. అదే సమయంలో శృతి గదిలో ఒంటరిగా ఉంది. ఇక బయటకు వెళ్లిన వారు సోమవారం తెల్లవారు జాము 3 గంటలకు హెూటల్‌కు తిరిగి వచ్చారు. ఎంతకీ శృతి ఎంతకీ డోర్ తీయకపోవడంతో హెూటల్ సిబ్బందికి చెప్పడంతో వారు మాస్టర్ కీతో తలుపు తీశారని.. అప్పుడు లోపల ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించిదని యువతి ఫ్రెండ్స్ తెలిపారు.సమాచారం తెలుసుకున్న యువతి పేరెంట్స్ హెూటల్‌కు చేరుకున్నారు. ఇది కచ్చితంగా హత్యేనంటూ ఆందోళన చేశారు. బీర్ బాటిల్స్, రక్తపు మరకలు ఉన్నాయని, తమ కూతురును చంపేశారంటూ వాపోయారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అన్ని మార్గాల్లో విచారణ చేపట్టి శృతిది ఆత్మహత్యేనని తేల్చారు.

# హమారా హిందూస్తాన్ యూత్ ఆధ్వర్యంలో శోభ యాత్రలో పాల్గొన్న. మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్

కాజీపేట్ సెప్టెంబర్ 19 (నమస్తే హైదరాబాద్ )కాజీపేట పట్టణం బాపూజినగర్ లోని హమారా హిందుస్థాన్ గణపతి ఉత్సవాలు ముగింపు రోజు సందర్భంగా అలాగే శోభాయాత్ర ప్రారంభం కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం మాట్లాడుతూ యువకులు పెద్ద ఎత్తున అందరు కలిసి హమారా హిందుస్థాన్ ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని రక్షించడానికి మట్టితో భారీ వినాయకుని తయారు చేయించి ఎంతో వైభవపేతంగా ఉత్సవాలను గత 14 సంవత్సరాల నుండి జరిగిస్తున్న హమారా హిందుస్థాన్ సభ్యులందరికీ నిర్వాహకులకు ఈ కాలనీ భక్తజనులకు ధన్యవాదాలు తెలియజేసినారు ఇంకా ఈ కార్యక్రమంలో 47 డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు బి.ఆర్.ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్ల గిరి రమేష్ బి.ఆర్.ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రాధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్



ఎండి అఫ్జల్ దువ్వ కనకరాజ్ కొండ్ర శంకర్ ఎండి సర్వర్ సోనీ మైముద్ దువ్వ నరేష్ తేలు సారంగపాణి సిలివేరు మల్లికార్జున్ రాబర్ట్ హమారా హిందుస్థాన్ కమిటీ సభ్యులు నార్లగిరి వినయ్ వెంకటేష్ గరిగ శివ నాగపురి అరవింద్ వెంకటేష్ లవన్ తదితరులు పాల్గొన్నారు

# మున్నూరు కాపు సంఘం నల్లగొండ జిల్లా ఇంఛార్జ్ గా గాజుల మహేందర్



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 19: తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజుల మహేందర్ నల్లగొండ జిల్లాకు ఇంఛార్జీగా నియామకమయ్యారు. గురువారం హైదరాబాద్ లోని మున్నూరు కాపు సంఘం అపెక్స్ కమిటీ సమావేశంలో మున్నూరు కాపు సంఘం అపెక్స్ కమిటీ గౌరవ అధ్యక్షులు, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, అధ్యక్షుడు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆదేశాల మేరకు మున్నూరు కాపు సంఘం అపెక్స్ కమిటీ చైర్మన్ పుట్టం పురుషోత్తం, మాజీ మంత్రి జోగు రామన్న, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యులు విఠల్, మీసాల చంద్రయ్యల చేతుల మీదుగా నియమాకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గాజుల మహేందర్ మాట్లాడుతూ జిల్లాలో మున్నూరు కాపు సంఘం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన మున్నూరు కాపు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పుట్ట కిషోర్, సూర్యాపేట జిల్లా మున్నూరు కాపు సంఘం కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మండలంలో గుండా రాజకీయాలు చేస్తే మాటకు మాట సమాధానం చెప్తాం..!

## జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి

దేవరుప్పుల ( నమస్తే హైదరాబాద్) : దేవరుప్పుల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సవాలుకు మేము సిద్ధమని గురువారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు ప్రెస్ మీట్ పెట్టడం రాష్ట్రంలో తొలిసారిగా జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సొమ్ము తీసుకొని బి ఆర్ఎస్ నాయకులపై నిరాధారామైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటువని తీవ్రంగా ఖండించారు. పాలకుర్తిలో ఎమ్మెల్యే ఉందా లేదా అని ప్రజలు అనుకుంటున్నారు . పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి లేదా ఝాన్సీ రెడ్డి అని తెలిపారు.రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురిచేసిన పక్క ఆధారాలు విలేకరుల ముంగట బయట పెట్టామని కొనియాడారు. బిఆర్ఎస్ పార్టీ నీతి నిజాయితీతో ఆధారాలు బయట పెట్టిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి బి ఆర్ఎస్ పార్టీ నాయకులపై ఇప్పటివరకు 10 కేసులు పెట్టారని ఎన్ని కేసులు పెట్టిన బిఆర్ఎస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే



చర్చకు రావాలని కోరారు. పాలకుర్తి ఎమ్మెల్యే పిఎ వ్యక్తిగత సహాకుడు ప్రెస్ మీట్ పెట్టడం ఎందుకనీ కాంగ్రెస్ పార్టీలో నాయకుడు లేరా అని మండిపడ్డారు. పాలకుర్తి నియోజకవర్గం లో ఏం జరుగుతుందో మీకు కనీసం అయిన అవగాహన ఉందా. లేకపోతే అవగాహన లేకుండా మాట్లాడుతున్నారా. మీ కాంగ్రెస్ పార్టీ నాయకులకు సరైన అవగాహన కల్పించండి. కల్పించకపోతే మా బిఆర్ఎస్ పార్టీ నాయకులే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. పాలకుర్తిలో ఒక్క ఓటుకు ముగ్గురు ఎమ్మెల్యేల పాలన కొనసాగుతుందనీ పాలకుర్తి అభివృద్ధి మీద దృష్టి పెట్టండనీ పాలకుర్తి అభివృద్ధి చేస్తే మేము కూడా స్వాగతిస్తామని అన్నారు. అంతేగాని దేవరుప్పుల మండలంలో గుండా రాజకీయాలు చేస్తే మాటకు మాట సమాధానం చెప్తామని మండిపడ్డ బిఆర్ఎస్ పార్టీ నాయకులు , ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రామ్ సింగ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బస్వా వెంకన్న, కడవెండి గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోతి ప్రవీణ్, పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి, ఇంటి మల్లారెడ్డి, రాజన్న ,కృష్ణమూర్తి, దుబ్బాక రత్నాకర్ రెడ్డి, వంగ అర్జున్, ఆలకుంట యాదగిరి, జేరిపోతుల సాయిలు , సోమయ్య, రామచంద్రం , రెడ్డి రాజుల రమేష్ , రాజకుమార్, శ్రీకాంత్, దాసగాని భరత్, శ్రీకాంత్ అరుణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు,

# కమటం అబ్బమ్మకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మందుల సామెల్



నాగారం, నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 19) మండల పరిధిలోని పసునూరు గ్రామ మాజీ ఎంపిటిసి కమటం మంజుల తల్లి కమటం అబ్బమ్మ మరణించగా విషయం తెలుసుకున్న తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య,జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు ఎల్మకంటి సోమన్న, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ నాయకులు,పంది శ్రీను, శ్రీను,నరేష్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యయూత్ వినాయకుని లడ్డు 2,10,000 కు కైవసం చేసుకున్న యంజల భాస్కర్ గౌడ్



పోచారం సెప్టెంబర్ 19 (నమస్తే హైదరాబాద్)మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ లోనీసూర్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జనం సందర్భంగా వేలంపాటలో 2,10,000 రూపాయలకు లడ్డూను దక్కించుకున్న యంజల భాస్కర్ గౌడ్, మరియు పూలు పండ్లను వేముల శశి గౌడ్ 21,000 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, నాయకులు నల్ల వెల్లి శేఖర్ ముదిరాజ్, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి పసులది కుమార్, ఆల్వల సంతోష్ గౌడ్, పావులూరి లోకేష్ రెడ్డి, కిరణ్, లఖాన్, బద్రి, ఎండిఖాన్, మహేష్, యంజాల శివ,శ్రీకాంత్ గౌడ్, వినోద్, ప్రదీప్ బావని శంకర్, ప్రసాద్ , మని,కిషోర్, పవన్, అంజి యూత్ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్బంధాలు.... అరెస్టులు బిఆర్ఎస్ కు కొత్త కాదు

## బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 19: రైతు సంఘాలు తలపెట్టిన ప్రజాభవన్ ముట్టడిలో భాగంగా గురువారం తుంగతుర్తి బిఆర్ఎస్ నాయకులను పోలీస్ లు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బేశరథుగా 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుబంధును వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ప్రతిపక్షాల సహకారంతో అడుగడుగునా ముట్టడిలు చేపడతామని హెచ్చరించారు. పోలీసుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాస్వామ్యంలో అరెస్టు చేయడం హేయమైనా చర్య అని అన్నారు ఇలాంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, సూర్య తండా తాజా మాజీ సర్పంచ్ లకావత్ యాకు నాయక్, గోపగాని శ్రీనివాస్ ,గోపగాని వెంకన్న, నాయకులు తదితరులు ఉన్నారు.

## వేలం పాటలో లడ్డును 2 లక్షల 20 వెయ్యిలకు దక్కించుకున్న బుల్లెట్ రమేష్ విశాలి దంపతులు



బోడుప్పల్ ( నమస్తే హైదరాబాద్) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి చెంగిచెర్ల క్రాంతి కాలనీ రోడ్డు నెంబర్ ఒకటి శ్రీ శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోహా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రులు పూజలందుకున్న లడ్డూను హావేలంపాటలో దంపతులుబుల్లెట్ రమేష్ విశాలి దంపతులు వారి కుమారులు అక్షిత్ రాజ్, గురు శరన్ 2 లక్షల 20 వెయ్యిలకు దక్కించుకున్నారు. వేలం పాటలో దక్కించుకున్న లడ్డును ముఖ్య అతిధిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ చేతుల మీదుగా దంపతులకు అందచేశారు అనంతరం వారిని కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు దంపతులు మాట్లాడుతూ నవరాత్రులు ఎంతో ఘనంగా పూజించిన లడ్డును మాకు దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ,కాలనీవాసులు పాల్గోన్నారు.

## ఈ ద్ ఏ మిలాద్ ఉన్ నబి వేడుకల్లో పాల్గొన్న మేయర్ అమర్ సింగ్..



మేడిపల్లి ( నమస్తే హైదరాబాద్ ): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ మసీద్ వద్ద ఏర్పాటు చేసిన "ఈద్ ఏ మిలాద్ ఉన్ నబి" వేడుకల్లో మేయర్ అమర్ సింగ్ పాల్గొన్నారు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా చేపట్టిన జూలూస్ శాంతి ర్యాలీలో మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,సీనియర్ నాయకులు, మాడుగుల చంద్రరెడ్డి,పప్పుల అంజిరెడ్డి,వంగూరి పరామేష్, కొల్తురి సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు




రుణమాఫీ కాని రైతులందరూ ఈరోజు ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న నేపథ్యంలో డిండి %దీ=ూ% నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వందశాతం రుణమాఫీ చేస్తామని చెప్పి చాలా మంది రైతులకు రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశాడన్నారు అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, రైతులు అందరు ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం దారుణం అన్నారు. కాంగ్రెస్ పాలనలో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా అణచివేస్తున్నదని ఆరోపించారు. అరుగ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరమోని శ్రీనివాస్, బలముల తిరుపతయ్య, గుర్రం సురేష్, మహమ్మద్ రషీద్, మహమ్మద్ బాసీత్, %ంఎ% పీర్ మహమ్మద్, మునగపాటి శ్రీను, బల్మూరి లక్ష్మయ్య, మహమ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని కృప వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉంది

- ముత్తయిదువులచే కుంకుమ పూజ అభినందనీయం
- కళాకారులను ప్రోత్సహించడం హర్షనీయం
- మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి




కూకట్పల్లి (నమస్తే హైదరాబాద్ ) : గణనాథుని కృపతో రాష్ట్రంలో అన్ని వర్గాలు సుభిక్షంగా ఉండాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ పట్నం సునీత



మహేందర్రెడ్డి అన్నారు. ఆశయాలు అతిపెద్ద కాలనీలో పేరోందిన కూకట్ పల్లి టెంపుల్ బస్ స్టాప్ లో కే.పీ. హెచ్.బి. కాలని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సతీమణి...శేరి మమతా ఆధ్వర్యంలో ముత్తయిదువలచే కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గణనాథుని కృపా కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు ఎక్కువ నష్టం జరగకుండా బయటపడగలిగామన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కె.పి.హెచ్.బి కాలనీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సనాతన ధర్మాన్ని పెంపొందించే విధంగా మన సాంస్కృతిని గౌరవించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి ఔత్సాహిక కళాకారులో నెలకొన్న సృజనాత్మకతను వెలికితీయడం అభినందనీయమన్నారు. సంస్కృతిని పెంపొందిస్తూనే కళాకారులను ప్రోత్సహించడం ద్వారా మంచిని పెంపొందించడం హర్షించదగ్గ పరిణామం అని అన్నారు. గణనాథుని దర్శించుకుని కుంకుమ పూజలు పాల్గొనడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో... సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి సంజీవ్ రావు,అరవింద్ రెడ్డి, మేకల మైకల్, రేష్మ, రజిత, జోజమ్మ, దేవ సహాయం రవి, లక్ష్మీనారాయణ,అబ్దుల్ బాకీ, గోవింద గౌడ్, కమిటీ సభ్యులు రాజేష్ గౌడ్,లుంగీ రాజు, రాజు ముదిరాజ్, పిడికిలి గోపాల్ చౌదరి, రామకృష్ణ రెడ్డి, లక్ష్మీ, ఆర్ కె, సుభాష్, తదితరులు పాల్గొన్నారు...

# ఖమ్మం వరద బాధితులను ఆదుకోవాలి,,,

## కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పందిరి సైదులు

నమస్తే హైదరాబాద్ : ప్రతి ఒక్కరూ ఖమ్మం జిల్లా వరద బాధితులకు విరాళాలు అందించి బాధితులను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా అధ్యక్షులు పందిరి సైదులు కోరారు,,తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు పందిరి సైదులు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా పందిరి సైదులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా అంత అతులాకుత్తలం అయిందని పంట పొలాలు గృహాలు నీట మునిగి ప్రజలు అన్ని విధాలుగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జిల్లాలోని



కళాకారులంతా విరాళాలు సేకరించి వారికి అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు, , ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి వరద బాధితులను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు, ,ఈ కార్యక్రమంలో..కళాకారులు మేదరి కిరణ్ కుమార్ , కోడి రాములు, వనం లింగయ్య, మల్ల యాదయ్య, రెముడాల శ్రీనివాస్, కంచి శ్రీనివాస్ , పనికార రమేష్, కోడి భీమ్ ప్రసాద్, పొట్టెపాక అంజయ్య, నకిరేకంటి వేణు, మధు, లలిత, శ్రీదేవి, కత్తుల విజయ్, పరమేశ్, చిక్కుల యాదయ్యా,తదితరులు పాల్గొన్నారు,

# తెలంగాణలో స్టాఫ్ నర్సుల నియమానికి నోటిఫికేషన్



నమస్తే హైదరాబాద్ : తెలంగాణలోని నిరుద్యోగు ల కొరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జాబ్ కేలండర్ ప్రకారం ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 2050 స్టాఫ్ నర్సుల ఉద్యోగాల భర్తీకి బుధవారం నోటీఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటీఫికేషన్‌లో భాగంగా రాష్ట్ర కుటుంబ సంక్షేమం, మెడికల్ డైరెక్టర్ విద్యలో 1576 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో 332 పోస్టులు, ఆయూష్‌లో 61, ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ లో 1, ఎంఎన్‌జె ఇనిస్ట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ క్యాన్స ర్ కేంద్రంలో 80 పోస్టులతో మొత్తం 2050 ఖాళీలను భర్తీ చేయనున్నారు.అదే సమయంలో రానున్న రోజుల్లో ఖాళీలు మరిన్ని పెరిగితే వాటిని జోడించడం లేదా తగ్గిస్తామని నోటీఫికే షన్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధిం చిన దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ లో 28.9.2024 నుండి ప్రారంభంకానుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు అక్టోబరు 14 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. దరఖాస్తు దారులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అక్టోబరు 16న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 వరకు సమయం ఇచ్చారు. ఖాళీల భర్తీకి నవంబరు 17న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ సీబీటీ, విధానంలో పరీక్షను నిర్వహించనున్నారు. 100 పాయింట్ల ప్రాతిపదికన రిక్రూట్ మెంట్ డ్రైవ్‌ను చేపడతామని వెల్లడించారు. ఇందులో 80 పాయింట్లు రాత పరీక్షలో పొందాలని, మరో 20 మార్కుల వెయిటేజీ రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కార్యక్రమాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరు నెలలుగా పనిచేస్తుంటే 2.5 పాయింట్లు ఇవ్వనున్నట్లు నోటీఫికేషన్‌లో పేర్కొన్నారు.

## వరద బాధితులకు రూ.10.25కోట్ల విరాళం ప్రకటించిన సింగరేణి ఉద్యోగులు..!

నమస్తే హైదరాబాద్ : వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి సింగరేణి కాలరీస్ సంస్థ 10కోట్ల 25లక్షల 65వేల 273 రూపాయల భారీ విరాళాన్ని అందించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, సంస్థ సీఎండీ బలరాం నాయక్ గారు, కార్మిక సంఘాల నేతలు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి ఈ మేరకు విరాళం చెక్కును అందజేశారు. సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి అండగా నిలుస్తూ విరాళం ఇచ్చిన సింగరేణి కుటుంబీకులు అందరికీ ముఖ్యమంత్రి గారు కృతజ్ఞతలు తెలిపారు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..